# నవతరం

నేటితరం కోసం...

హైదరాబాద్ | బుధవారం, జనవరి 21, 2026 | సంపుటి:11 | సంచిక :266 | పేజీలు: 8 | వెల : రూ.5





గ్యారంటీల ముసుగులో

## ప్రజాధనం దోపిడీ

::: రేవంత్ రెడ్డి పాలనపై హరీశ్‌రావు ఫైర్

## ఉగాదిలోపు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి: పవన్ కల్యాణ్



- ఉగాది నుంచి 50% గ్రీన్ కవర్ ప్రాజెక్టు అమలుకు పవన్ ఆదేశం
- 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపే లక్ష్యం
- ప్రాజెక్టులో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వాములు కావాలని స్పష్టం
- కాలుష్యాన్ని నియంత్రించే, స్వజాతి మొక్కలకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశం

2లో

## చాగోస్‌లా కావొద్దనే...

గ్రీన్‌లాండ్ స్వాధీన యత్నాలపై ట్రంప్

బ్రిటన్ తీరుపై అధ్యక్షుని విమర్శలు





## నైనీ కోల్ టెండర్లపై సీబీఐ విచారణ డిమాండ్

- నైనీ కోల్ టెండర్ల రద్దుతో బయటపడిన అవినీతి ఆరోపణలు
- అంతర్గత విభేదాలు బట్టబయలు
- సీఎంమంత్రుల మధ్య చీలికలపై రామచందర్ రావు విమర్శలు
- బంధువులు, సన్నిహితులకు లాభం చేకూర్చే కుట్ర ఆరోపణ
- రాష్ట్ర విచారణ సరిపోదు
- స్వతంత్రంగా సీబీఐతో లోతైన దర్యాప్తు అవసరం

## టీం 11 ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెడతారా

- జ్యూరిచ్ లో తెలుగు డయాస్పొరా సమావేశం
- సీఎం చంద్రబాబుతో పాటు పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ఏపీకి రావొద్దని ఏడుపుగొట్టు టీం కంపెనీలకు ఈమెయిల్స్ పెడుతోందని విమర్శలు

అర్థమైందా రాజా అంటూ పరోక్ష వ్యాఖ్యలు

2లో



# ఒకరు ఉద్యోగం, మరొకరు వ్యాపారం చేయండి

### జ్యూరిచ్‌లో తెలుగు డయాస్పోరాతో సీఎం చంద్రబాబు భేటీ




- ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎన్నార్టీలు ఎదగాలని పిలుపు
- ఎన్నార్టీల కోసం రూ. 50 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- విదేశీ విద్య అభ్యసించేవారికి ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు ఇస్తామని హామీ
- ఏపీకి భారీగా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని వెల్లడి

ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన తెలుగు ప్రజలు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, అప్పుడే తెలుగు జాతి సంపూర్ణంగా అభివృద్ధి చెందినట్లు తాను భావిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. దావోస్ పర్యటనలో భాగంగా తొలిరోజు జ్యూరిచ్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 20 దేశాల నుంచి కుటుంబాలతో సహా హాజరైన ప్రవాసాంధ్రులతో ఆత్మీయంగా ముచ్చటించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారికి పిలుపునిచ్చారు.

# దావోస్‌లో తెలంగాణ రైజింగ్ దౌత్యం

### దేశంలోనే తొలి నెట్ జీరో గ్రీన్ ఫీల్డ్ నగరంగా ఫ్యూచర్ సిటీ

- ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు .. ఇప్పటికే మరుబెని, సెమ్ కార్ప్‌ల భాగస్వామ్యం
- యూఏఈ మంత్రికి వివరించిన సీఎం.. కలిసి పనిచేస్తామన్న అల్‌మార్రీ.. పలు సంస్థల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి భేటీ
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీపై సౌదీ సంస్థ 'ఎక్స్‌పర్టైజ్' ఆసక్తి.. ఏఐ రంగంలో రాయల్ ఫిలిప్స్ భాగస్వామ్యం
- వివిధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు గూగుల్ సంసిద్ధత



హైదరాబాద్: దేశంలోనే తొలి కాలుష్య రహిత, పర్యావరణ హిత (నెట్ జీరో (గ్రీన్‌ఫీల్డ్) స్మార్ట్ సిటీగా తెలంగాణలో రూపుదిద్దుకోనున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి ప్రాజెక్టు ప్రత్యేకతలను దావోస్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. 30 వేల ఎకరాల్లో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మరుబెని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వామ్యం కావడం గురించి తెలియజేయడంతో పాటు, రిలయన్స్ గ్రూప్ (వంతారా) ఏర్పాటు చేస్తున్న జంతు ప్రదర్శనశాల ప్రత్యేకతలను వివరించారు.



## బలవంతపు ట్రాఫిక్ చలానాలకు హైకోర్టు బ్రేక్

- పెండింగ్ చలాన్ల వసూలులో ఒత్తిడి చేయరాదని ఆదేశం
- తాళాలు లాక్కోవడం, వాహనం ఆపడం చట్టవిరుద్ధం
- వాహనదారు చెల్లిస్తేనే చలానా వసూలు
- చెల్లించనివారికి చట్టప్రకారం నోటీసులు

తెలంగాణలో పెండింగ్ ట్రాఫిక్ చలాన్‌ల వసూలు వ్యవహారంపై హైకోర్టు కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. వాహనదారుల నుంచి బలవంతంగా చలాన్‌లు వసూలు చేయరాదని, చట్ట పరిధిని దాటి ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని ట్రాఫిక్ పోలీసులను హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు పెండింగ్ చలాన్‌ల పేరుతో వాహనదారులను వేధిస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, పౌరుల హక్కులను కాపాడే దిశగా ఈ స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. పెండింగ్ చలాన్‌ల వసూలు కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపడం, తాళాలు లాక్కోవడం, వాహనాలను సీజ్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయవాది

(మిగతా 2వ పేజీలో)



## నబీన్ నా బాస్

నా పనితీరుపై నిర్ణేత: మోదీ.. బీజేపీ పగ్గాలు చేపట్టిన నబీన్

వేడుకగా జరిగిన కార్యక్రమం.. హాజరైన బీజేపీ ముఖ్య నేతలు

## ఉగాదిలోపు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి: పవన్ కల్యాణ్

రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపే లక్ష్యంగా చేపట్టిన 'గ్రీన్ కవర్' ప్రాజెక్టును ఉగాది నుంచి అమలు చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను (యాక్షన్ ప్లాన్) పండుగలోపు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలూ త్రికరణ శుద్ధిగా పాలుపంచుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ాామంగళవారం సచివాలయంలో '50% గ్రీన్ కవర్' ప్రాజెక్టుపై అటవీ, పర్యావరణ శాఖలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనం నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం పచ్చదనం ఉండగా, వచ్చే నాలుగేళ్లలో దీనిని 37 శాతానికి పెంచాల్సి ఉందని, ఇందుకోసం 9 లక్షల హెక్టార్లలో మొక్కలు నాటాలని వివరించారు. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పవన్ సూచించారు. పరిశ్రమల శాఖ కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటాలని, తీర ప్రాంతాల్లో ఉప్పునీటిని, పెనుగాలులను తట్టుకునే స్థానిక జాతుల మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టును కూడా సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. రైతుల భూముల్లో వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే పండ్ల మొక్కలు, కాలువ గట్ల వెంబడి మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, బడ్జెట్ కేటాయింపులపై ఆయనతో చర్చిస్తానని పవన్ అన్నారు. ఫిబ్రవరి 5న జరిగే తదుపరి సమావేశానికి పూర్తిస్థాయి ప్రణాళికలతో రావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

## చాగోస్‌లా కావొద్దనే...

లండన్/దావోస్: గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు తాను చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. "బ్రిటన్ వంటి దేశమే మారిషస్ నుంచి అప్పుడెప్పుడో కొనుగోలు చేసిన చాగోస్ దీవులపై అధికారాన్ని అకారణంగా తిరిగి ఆ దేశానికి వదిలేసుకుంటోంది. అక్కడి డీగో గార్షియా దీవుల్లో అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన నావిక, బాంబర్ స్థావరాలున్నాయి. వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారిందిప్పుడు. గ్రీన్‌లాండ్ విషయంలోనూ అలాంటిది జరగొద్దనే ఆ దీవి అమెరికా చేతిలో ఉండాలని చెబుతున్నాను" అని సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్‌సోషల్‌లో రాసుకొచ్చారు! 'నాటోకు చెందిన అత్యంత తెలివైన సభ్య దేశం' ఇలాంటి తెలివి తక్కువ పనికి దిగుతోందంటూ బ్రిటన్‌ను ఎద్దేవా కూడా చేశారాయన. "బ్రిటన్ కనబరిచిన ఈ బలహీనతను చైనా, రష్యా కచ్చితంగా గమనించే ఉంటాయి. గ్రీన్‌లాండ్‌పై మరింత దూకుడు పెంచే ఆలోచన కూడా చేస్తుండి ఉంటాయి" అని చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను బ్రిటన్ ఖండించింది. ాాగోస్ దీవులను మారిషస్‌కు అప్పగించాలన్న నిర్ణయం పూర్తిగా సబబేనని పేర్కొంది. చాగోస్ దీవుల్ని రెండు శతాబ్దాల క్రితం మారిషస్ నుంచి బ్రిటన్ కారుచౌకగా కొనుగోలు చేసింది. వాటిని మారిషస్‌కు తిరిగిచ్చేలా, డీగో గార్షియా దీవిని మాత్రం 99 ఏళ్ల లీజుకు బ్రిటనే అట్టిపెట్టుకునేలా గతేడాది ఒప్పందం కుదిరింది. అప్పుడు దాన్ని స్వాగతించిన ట్రంప్ ఇప్పుడు మాత్రం తప్పుబడుతున్నారుద

## గ్యారంటీల ముసుగులో ప్రజాధనం దోపిడీ

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దీర్ఘకాలం పాటు విచారించడంపై తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర దుమారం చెలరేగింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు ఏడు గంటల పాటు కొనసాగిన ఈ విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో స్పందించారు. మంత్రుల అవినీతి, సీఎం బావమరిది కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనపై కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం వరకు కొనసాగింది. సిట్ అధికారులు ఎస్పీ నారాయణరెడ్డి, ఏసీపీ వెంకటగిరి హరీశ్‌రావును ప్రశ్నించారు. విచారణ సమయంలో హరీశ్‌రావు వెంట వచ్చిన న్యాయవాదులను పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించకపోవడం వివాదాస్పదంగా మారింది. మరోవైపు జూబ్లీహిల్స్ పీఎస్ పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించి శాంతిభద్రతలను కట్టుదిట్టం చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సోమవారం సిట్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. జిల్లా పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు కోకాపేటలోని ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు. విచారణ ముగిసిన వెంటనే మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు, ఈ మొత్తం వ్యవహారాన్ని రాజకీయ ప్రతీకారంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది వేల కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణానికి పాల్పడ్డారని తాను బయటపెట్టినందుకే తనపై ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తీసుకొచ్చారని మండిపడ్డారు. సీఎం, ఆయన బావమరిది కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు మోపారని, దీనికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు.

## దావోస్‌లో తెలంగాణ రైజింగ్ దౌత్యం

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం తొలిరోజు వరుస భేటీలు నిర్వహించింది. అంతర్జాతీయంగా పేరొందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులతో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మరోవైపు యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్‌మార్రీతో కూడా ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఫ్యూచర్ సిటీ గురించి చెప్పారు. ఈ భేటీల్లో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను సీఎం ఈ సందర్భంగా వివరించారు. ధారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో తెలంగాణతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తెలిపారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తితో ఉందన్నారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేఏందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యంపై సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్‌పర్టైజ్' ఆసక్తి చూపింది. సీఎం రేవంత్‌తో ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈఓ మొహమ్మద్ ఆసిఫ్ భేటీ అయ్యారు. తమ సంస్థలో ఏటా సుమారు 5 వేల మంది నైపుణ్యం కలిగిన సిబ్బంది నియామకం జరుగుతోందని, యంగ్ ఇండియాతో భాగస్వామ్యం తమకు ఉపకరిస్తుందని చెప్పారు.

# బలవంతపు ట్రాఫిక్ చలానాలకు హైకోర్టు బ్రేక్



విజయ్ గోపాల్ వాదనలు వినిపిస్తూ, చట్టబద్ధమైన ప్రక్రియను పక్కనపెట్టి ట్రాఫిక్ పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వాహనదారులు చలాన్ చెల్లించడానికి సిద్ధంగా లేకపోయినా, రోడ్డు మీదే ఒత్తిడి తెచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించిన హైకోర్టు, ట్రాఫిక్ పోలీసుల చర్యలపై స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేసింది. పెండింగ్ చలాన్‌లున్నాయనే కారణంతో వాహనాన్ని ఆపి, వాహనదారుడిపై ఒత్తిడి తెచ్చి డబ్బులు వసూలు చేయడం సరికాదని పేర్కొంది. వాహన తాళాలు లాక్కోవడం, వాహనాన్ని సీజ్ చేయడం వంటి చర్యలు చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ తరహా చర్యల వల్ల ప్రజల స్వేచ్ఛ, గౌరవం దెబ్బతింటుందని కోర్టు అభిప్రాయపడింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం, ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని ఆపిన సమయంలో వాహనదారు స్వచ్ఛందంగా పెండింగ్ చలాన్‌లు చెల్లించడానికి ముందుకు వస్తే మాత్రమే డబ్బులు వసూలు చేయాలి. వాహనదారుడిపై ఎలాంటి బలవంతం ఉండకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ వాహనదారుడు చలానా చెల్లించడానికి ఇష్టపడకపోతే, ట్రాఫిక్ పోలీసులు చట్ట ప్రకారం నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. రోడ్డు మీదే వివాదం సృష్టించడం, వాహనదారుడిని ఇబ్బంది పెట్టడం సరైన విధానం కాదని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాలతో ట్రాఫిక్ చలాన్‌ల వసూలు ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని న్యాయనిపుణులు అభిప్రాయ పడుతున్నారు. చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, ఆ తరువాత చలానా వసూలు చేయడం ద్వారా వ్యవస్థ మరింత క్రమబద్ధంగా మారుతుందని భావిస్తున్నారు. అలాగే, ఈ తీర్పు వాహనదారుల హక్కులను కాపాడే కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. ఇటీవల పెండింగ్ చలాన్‌ల సంఖ్య పెరగడంతో, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ల పేరుతో వాహనదారులను ఆపి చలానాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ట్రాఫిక్ పోలీసులకు స్పష్టమైన మార్గదర్శకంగా నిలుస్తాయని భావిస్తున్నారు.

## నైనీ కోల్ టెండర్లపై సీబీఐ విచారణ డిమాండ్



తెలంగాణలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దు వ్యవహారం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర రాజకీయ, పరిపాలనా సంక్షోభంగా మారుతోంది. ఈ అంశంపై తెలంగాణ బీజేపీ సీనియర్ నేత రామచందర్ రావు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. నైనీ కోల్ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలు కేవలం పరిపాలనా లోపాలు కావని, ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలు, అవినీతి ధోరణులను స్పష్టంగా బయటపెడుతున్నాయని ఆయన విమర్శించారు. రామచందర్ రావు మాట్లాడుతూ, నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య స్పష్టమైన విభేదాలు బయటపడ్డాయని అన్నారు. ప్రభుత్వ పెద్దలు తమ బంధువులు, సన్నిహితులకు లాభం చేకూర్చేలా గనుల కేటాయింపుకు కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు. ప్రజల ఆస్తి అయిన బొగ్గు గనులను కొద్దిమంది ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే ఈ టెండర్ల ప్రక్రియ రూపొందించారని పేర్కొన్నారు. అయితే, ఈ అక్రమాలపై మీడియాలో విస్తృతంగా కథనాలు వెలువడటంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడికి లోనై, బయటపడతామనే భయంతోనే హడావుడిగా టెండర్లను రద్దు చేసిందని ఆయన ఎద్దేవా చేశారు. టెండర్ల రద్దుతో సమస్య ముగిసినట్టుగా ప్రభుత్వం భావించడం సరికాదని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఇది కేవలం పైపై చర్య మాత్రమేనని, అసలు ఈ టెండర్ల వెనుక ఉన్న కుట్ర, నిర్ణయాలు తీసుకున్న వ్యక్తులు, లబ్ధిదారులెవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ వ్యవహారంలో భారీ స్థాయిలో క్విడ్ ప్రో కో (ుబఱఉ ూతీశీ ుబశీ) జరిగిందన్న అనుమానాలు బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. అందుకే దీనిపై రాష్ట్రస్థాయి విచారణ సరిపోదని, సీబీఐ లేదా ఇతర స్వతంత్ర కేంద్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. రామచందర్ రావు అభిప్రాయం ప్రకారం, నైనీ కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారం రాష్ట్ర ఆర్థిక వనరుల దుర్వినియోగానికి నిదర్శనం. బొగ్గు గనులు ప్రజల సంపద అని, వాటి కేటాయింపులో పారదర్శకత, న్యాయసూత్రాలు పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి, రాజకీయ ప్రయోజనాల కోసం, వ్యక్తిగత లాభాల కోసం నిర్ణయాలు తీసుకుందని విమర్శించారు. బాధ్యులు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదని, చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు బీఆర్ఎస్ పార్టీపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అంశంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు లేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక అక్రమాలు, అవినీతి వ్యవహారాలు ఇప్పటికీ పూర్తిగా వెలుగులోకి రాలేదని ఆయన గుర్తు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన దోపిడీపై సమగ్ర విచారణ జరగకుండానే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. అయితే, రామచందర్ రావు మాటల్లో, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను చూపిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన అక్రమాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ అయినా, కాంగ్రెస్ అయినా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే ధోరణిలో పెద్ద తేడా లేదని ఆయన ఆరోపించారు. రెండు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను వంచించడం, వనరులను కొద్దిమంది చేతుల్లో పెట్టడం ఒకే తీరుగా కొనసాగుతోందని విమర్శించారు.

## టీం 11 ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెడతారా

'ఏపీలో ఉన్న టీం 11' ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి వస్తారా? అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ప్రశ్నించారు. పెట్టుబడుల కోసం తాము ప్రయత్నిస్తుంటే, ఏపీకి రావొద్దని ఆ 'ఏడుపుగొట్టు టీం' కంపెనీలకు ఈ-మెయిల్స్ పెడుతోందని ఆరోపించారు. కోడికత్తి, బాబాయి హత్య, ప్రజాధనంతో ప్యాలెస్ కట్టుకున్న క్రెడిట్ మాత్రమే వారికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్ వెళ్లిన ఆయన, జ్యూరిచ్ లో ఏపీఎన్ఆర్టీ ఆధ్వర్యంలో జరిగిన యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, పరోక్ష విమర్శలు గుప్పించారు. "ఏపీలో టీం 11 ఉంది. అర్థమైందా రాజా? అదో ఏడుపుగొట్టు టీం. పెట్టుబడులు తీసుకువస్తామంటే ఏడుస్తారు. పెట్టుబడుల కోసం సింగపూర్ కు వెళితే.. ఏపీకి రావద్దని ఆ ఏడుపుగొట్టు టీం ఈ-మెయిల్స్ పెట్టే పరిస్థితి. కొన్ని కంపెనీలను కలిస్తే ఏపీకి రావొద్దంటూ వారికి కూడా ఈ-మెయిల్స్ పెడుతున్నారు. సీఎం చంద్రబాబు గారిని చూసి సదరు కంపెనీలు వస్తే మాత్రం క్రెడిట్ తీసుకోవాలనుకుంటారు. మళ్లీ క్రెడిట్ చోరీ అంటారు. టీం 11 ముఖం చూసి ఎవరైనా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తారా? కోడికత్తికి వారికి క్రెడిట్ ఇవ్వాలి. బాబాయిని లేపేసిన క్రెడిట్ ఇవ్వాలి. చెల్లినీ, తల్లినీ గెంటేసిన క్రెడిట్ ఇవ్వాలి. రూ.700 కోట్ల ప్రజాధనంతో విశాఖలో ప్యాలస్ కట్టుకున్న క్రెడిట్ ఏడుపుగొట్టు టీంకి ఇవ్వాలి"

## పార్టీ వ్యవహారాల్లో... నబీన్ నా బాస్

చెందిన యువ నాయకుడు నితిన్ నబీన్ సిన్హా పార్టీ జాతీయ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమం ఇందుకు వేదికైంది. బీజేపీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో 45 ఏళ్ల నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రకటించారు. మేరకు సర్టిఫికెట్‌ను ఆయనకు అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఐదో అంతస్తులోని చాంబర్‌లో ప్రస్తుత అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా నుంచి నబీన్ లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ అతిరథ మహారథులంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి, నయాబ్ సింగ్ సైనీ, ప్రమోద్ సావంత్, ముఖ్యమంత్రి పేమా ఖండు తదితరులు వీరిలో ఉన్నారు. మోదీతో పాటు వారంతా నబీన్‌ను స్వయంగా అధ్యక్ష చాంబర్లోకి తోడ్కొని వెళ్లారు. బీజేపీ చరిత్రలో అతి పిన్న వయస్కుడైన అధ్యక్షునిగా, బిహార్ నుంచి వచ్చిన తొలి సారథిగా నబీన్ నిలిచారు. బీజేపీకి ఆయన 12వ అధ్యక్షుడు. నబీన్ ఎన్నికను చరిత్రాత్మక ఘట్టంగా నడ్డా అభివర్ణించారు. ఇంతకాలం తనకు అన్నివిధాలా సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నబీన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను నవతరానికి ప్రతినిధి (మిలీనియల్)గా అభివర్ణించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. "ప్రభుత్వ నేతగా, ప్రధానిగా ఎంత అనుభవమున్నా అన్నింటికంటే ముందు నేను బీజేపీ కార్యకర్తను. ఇకపై పార్టీపరమైన వ్యవహారాల్లో నితిన్ నాకు బాస్" అని చెప్పారు. ఆయన్ను పదేపదే 'గౌరవనీ యులైన' అంటూ సంబోధించారు. "యువకుడైన నబీన్ శక్తియుక్తులు, వ్యవస్థాగత వ్యవహారాల్లో ఆయనకున్న అపార అనుభవం పార్టీకి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఇకపై ఆయన నోట వచ్చే ప్రతి మాటా మాకందరికీ నూతన దిశానిర్దేశం చేస్తుంది. పార్టీ భావి కార్యాచరణకు నబీన్ మార్గదర్శకత్వం వెలకట్టలేని ఆస్తి కానుంది" అన్నారు. "పార్టీ కార్యకర్తగా నేను కూడా నా పనితీరును ఎప్పటికప్పుడు నూతన అధ్యక్షునికే నివేదిస్తాను. నా పనితీరుకు సంబంధించిన రహస్య నివేదికను రాసేది ఆయనే. కనుక నబీన్ మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తున్నా" అని మోదీ చెప్పుకొచ్చారు.

## ఒకరు ఉద్యోగం, మరొకరు వ్యాపారం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఒకప్పుడు దావోస్‌కు వస్తే భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు కనిపించేవారు కాదు. కానీ ఇప్పుడు ఇక్కడి వాతావరణం చూస్తుంటే విజయవాడలోనో, తిరుపతిలోనో ఉన్నట్లు అనిపిస్తోంది. ఇది ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది" అని అన్నారు. ప్రపంచంలోని 195 దేశాల్లో తెలుగువారు ఉన్నారని, 148 దేశాల్లో ఎన్నార్టీ వ్యవస్థను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ప్రవాసాంధ్రులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే, ఒకరు ఉద్యోగం చేస్తూ మరొకరు వ్యాపారం ప్రారంభించండి. 'ఒన్ ఫ్యామిలీ-ఒన్ ఎంటర్‌ప్రెన్యూర్' అనేది మన విధానం. ఏపీలో వ్యాపారాలకు అపార అవకాశాలున్నాయి" అని సూచించారు. ఎన్నార్టీలను ప్రోత్సహించేందుకు రూ. 50 కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కీలక ప్రకటన చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా అవసరమైన మార్గనిర్దేశం చేస్తామని హామీ ఇచ్చారు. 'గతంలో నేను విజన్ 2020, ఐటీ గురించి మాట్లాడినప్పుడు చాలామంది విమర్శించారు. కానీ ఆనాటి నిర్ణయాల వల్లే నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది, అని ధీమా వ్యక్తం చేశారు. లోకేశ్, రామ్మోహన్ నాయుడు వంటి యువతకు ప్రభుత్వంలో, పార్టీలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడంపై మాట్లాడుతూ, "విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించడం సాధ్యమా అని చాలామంది ఆందోళన చెందారు. కానీ కేవలం 18 నెలల కాలంలోనే రాష్ట్ర బ్రాండ్‌ను పునరుద్ధరించాం. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ముందుకు వెళ్తున్నాం" అని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని, దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని తెలిపారు. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్ (రూ. 1 లక్ష కోట్లు), ఏఎం గ్రీన్ (10 బిలియన్ డాలర్లు) వంటి భారీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నారు. "ప్రస్తుతం రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులపై కసరత్తు చేస్తున్నాం. ఇది పూర్తయితే 20 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని చెప్పారు. భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చంద్రబాబు తెలిపారు.

# కేరళలో ఆత్మహత్య చేసుకున్న దీపక్

### ::: వైరల్ వీడియోపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం




ఆన్లైన్, నవతరం: రళలో గత ఆదివారం నాడు యు. దీపక్ (42) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణలు వచ్చిన కొద్ది రోజులకే ఆయన మరణించడం గమనార్హం. దీనికి సంబంధించి షింజిత అనే సదరు మహిళ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియో వైరల్ అయ్యింది. జనంతో కిక్కిరిసి ఉన్న ఆ బస్సులో, దీపక్ మోచేయి ఆ మహిళ శరీరానికి తగులుతున్నట్లు ఆ వీడియోలో కనిపిస్తోంది. అది లైంగిక వేధింపే అని ఆ మహిళ ఆరోపించగా, బస్సులో రద్దీ కారణంగా అది యాదృచ్ఛికంగా జరిగిన సహజమైన చేతి కదలిక మాత్రమేనని వీడియో చూసిన పలువురు అభిప్రాయపడ్డారు. దీపక్ ఆత్మహత్య ఘటన ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. కేవలం ప్రమాదవశాత్తు జరిగిన స్పర్శను లైంగిక వేధింపుగా చిత్రీకరించి, ఆమె విషయాన్ని పెద్దది చేసిందని షింజితపై పలువురు మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం దీపక్ తన గదిలో విగతజీవిగా కనిపించాడు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవడంతో, దీపక్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడని అతని బంధువులు, స్నేహితులు ఆరోపించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కెకెఎం ట్రస్ట్ చైర్మన్




కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో కెకెఎం ట్రస్ట్ చైర్మన్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన చాపల లక్ష్మి, గుడ్డి భారతమ్మ, డి దేవి, రఫియా బేగం, బిరిదర్ సునీత, ఆవుల తిరుమలేష లు గతంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి తన నివాసం వద్ద నాలుగు లక్షల రూపాయల సిఎంఆర్ఆఫ్ చెక్కులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అలాగే మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుంన్నారని కొనియాడారు. ప్రజాపాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా లు కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడంతో పాటు వైద్యనికి అయినా ఖర్చులు సిఎంఆర్ఆఫ్ ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, చాంద్ పాషా, కృష్ణ యాదవ్, నర్సింగరావు, గుబ్బల రమణ, గుమస్తా మధుసూదన్, జహంగీర్, బలరాం, ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సంతోష్ గుప్తా, చోటు, బురాన్, నాగలక్ష్మి, శోభ, ధరణి, లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.





## హ్యాపీ బర్త్ డే కోడిచెర్ల వినోద్

హైదరాబాద్, నవతరం: కూకట్పల్లి నియోజకవర్గం ఓ.బీ.సీ మోర్చ కన్వీనర్ కోడిచెర్ల వినోద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు కోడిచెర్ల వినోద్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఓ.బీ.సీ వర్గాల సంక్షేమం కోసం బిజెపి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పార్టీ బలోపేతానికి వినోద్ కుమార్ వంటి అంకితభావంతో పనిచేసే నాయకుల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొని, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కోడిచెర్ల వినోద్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... తన జన్మదినం సందర్భంగా ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పట్ల ఉన్న నిబద్ధతతో, ఓ.బీ.సీ వర్గాల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్, దినేశ్, క్రాంతి కుమార్, తదితరులు కోడిచెర్ల వినోద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## కర్ణాటక డీజీపీ రామచంద్రారావు సస్పెండ్

కర్ణాటక, నవతరం: డీజీపీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి రామచంద్రరావు తన కార్యాలయంలో మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు చూపించిన వీడియో వైరల్ కావడంతో కర్ణాటక ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. ఈ వివాదం ప్రజల ఆగ్రహాన్ని, రాజకీయ విమర్శలను రేకెత్తించింది. ముఖ్యమంత్రి ఈ సంఘటనపై వివరాలను కోరగా, ముఖ్యమంత్రి ఈ ఫుటేజ్‌ను "కల్పితం మరియు అబద్ధం" అని అభివర్ణిస్తూ రామచంద్రరావు ఆరోపణలను ఖండించారు. ప్రతిపక్ష పార్టీలు అధికారిక విచారణకు డిమాండ్ చేశాయి, పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనం గురించి ఆందోళనలను హైలైట్ చేశాయి. రామచంద్రరావు అధికారిక గదిలో రికార్డ్ చేయబడిన వీడియో, యూనిఫాంలో ఉన్న అధికారి కార్యాలయ సమయంలో వేర్వేరు మహిళలతో సన్నిహితంగా సంభాషిస్తున్నట్లు చూపిస్తుంది. ఈ ఫుటేజ్ సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించిందని, ఇది త్వరిత పరిపాలనా చర్యకు దారితీసిందని వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంపై చర్చించడానికి రావు హోంమంత్రిని కలిశారు, కానీ వీడియో మార్ఫింగ్ చేయబడిందని, తప్పుదారి పట్టించేది అని వాదించారు. బంగారు స్మగ్లింగ్ నిందితుడి తండ్రితో జరిగిన ఈ సంఘటన రాజకీయ చర్చను తీవ్రతరం చేసింది, పారదర్శకత, తగిన ప్రక్రియను నిర్ధారించాలని అధికార కాంగ్రెస్ ఒత్తిడిలో ఉంది. అధికార దుర్వినియోగాన్ని నిరోధించడానికి, ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడానికి అధికారులు యంత్రాంగాలను ఎలా బలోపేతం చేయవచ్చు అని పలువురు భిన్నభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం



బాచుపల్లి, నవతరం: సలీముద్దీన్, తండ్రి పేరు సయ్యద్ అఫ్సర్, వయస్సు 35 సంవత్సరాలు, వృత్తి కూలీ, నివాసం ఇంటి నెం. 4-8/32, శ్రీ సాయి నగర్, బాచుపల్లి గల వ్యక్తి 20.02.2025 తేదీన రాత్రి సుమారు 01:00 గంటల సమయంలో "సాగర్ గుట్కా కొనడానికి వెళు _న్నాను" అని చెప్పి ఇంటి నుండి వెళ్లి, ఇప్పటివరకు తిరిగి రాలేదు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. గతంలో కూడ ఇంటి నుండి వెళ్లి కొన్ని రోజులకు తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. బంధువులు, స్నేహితులు, అన్ని సాధ్యమైన ప్రదేశాలలో వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా ఏమైనా సమాచారం తెలిసినట్లయితే బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు గాని లేదా ఈ నెంబర్లకు దర్యాప్తు అధికారి 8712567898, 8712663160, 9908502370 లకు గాని తెలియజేయగలరని స్థానిక పోలీసులు కోరుతున్నారు.


## ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్

Plot No. 174 to 176, phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051. 9391221697

**చదువుకునే పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం**

బి. యన్. రెడ్డి నగర్ ఫేజ్ - 1 ఐకాం ఎదురుగా చర్లపల్లిలో 1996 సం॥లో "ద హోంఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్" అనే విద్యార్థుల వసతి గృహము స్థాపించబడినది. ఈ సంస్థ నగరంలోని దాతల సహకారంతో నడుపబడుచున్నది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం ఏమంటే బాగా చదువగలిగి ఉండి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేసేవారిని కూలీలుగా కార్మికులుగా మారకుండా సమాజానికి పనికివచ్చే మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని. గ్రామీణ పేద విద్యార్థులకు హైదరాబాద్ నగరంలో ఉండి చదువగలిగే ఆర్థిక స్తోమత లేనివారికి వసతి, భోజనం, పుస్తకాలు, నోట్‌పుస్తకాలు. బస్‌పాస్ మరియు పరీక్షఫీజులు కూడా చెల్లించి వారి భావి జీవితము అత్యున్న తంగా ఉండేలా తీర్చిదిద్దాలని మా ఆశయం.

ఇందులో అడ్మిషన్ పొందగలిగే విద్యార్థులకు కులము. మతము పట్టింపులు ఏమీ ఉండవు. ఇందులో చదువుకోదలచిన విద్యార్థులకు నగరంలో ఏదైనా కళాశాలలో అడ్మిషన్ పొంది ఉండవలెను మంచి మార్కులు వచ్చిన అనాధ విద్యార్థులకు తల్లి లేదా తండ్రి లేనివారికి గ్రామీణ పేద విద్యార్థులకు మేనేజ్‌మెట్ తరవున కళాశాల యాజమాన్యంతో సంప్రదించి వీలైతే ఏదైనా మంచి కళాశాలలో ఫ్రీ అడ్మిషన్ ఇప్పించుటకు మా వంతు కృషి చేయగలము.

ఈ సంస్థ స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఇందులో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి మన్ననల్ని పొందుచున్నారు సుమారు 400 మంది గత 29 సం॥లలో ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు

ఇందులో అడ్మిషన్ కోరకై విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి (ఇంటర్ 1. 2. ఏదైనా డిగ్రీ ఫస్ట్ ఇయర్‌వారు) దరఖాస్తుకు అర్హులు గ్రామీణ అనాధ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది తల్లి లేదా తండ్రి లేని నిరుపేద విద్యార్థులు. పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చును. విద్యార్థులు తమ మార్కులకు సంబంధించిన మెమో. అదే విధంగా బోనోఫైడ్ సర్టిఫికేట్స్ (ప్రస్తుతం చదువుతున్న కళాశాలకు సంబంధించినది). తల్లిదండ్రులు లేనిచో మరణ ధృవీకరణ పత్రము ఆదాయం సర్టిఫికేట్ (ఎం.ఆర్.ఓ. గారిచే ధృవీకరించబడినది అయి ఉండాలి). అన్ని సర్టిఫికేట్స్ యొక్కజిరాక్స్ కాపీలను మరియు రెండు పాస్‌పోర్టుసైజు పోటోలను పోంత చిరునామా కలిగిన స్టాంపులు అంటించి కవరును పోస్టు ద్వారాగాని. ఇమెయిల్ ద్వారాగాని. వాట్సప్ (9391221697) ద్వారాగాని. స్వయంగా గాని పైన ఉన్న చిరునామాకు వెంటనే పంపించగలరు. పూర్తి వివరాలకుపైన నెంబర్లకు సంప్రదించగలరు.

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అడ్రస్ కొరకు SCAN చేయండి

మనవి : కళాశాల ప్రిన్సిపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు చదువుకునే పదవతరగతిలో ఉత్తీర్ణులైన పేద విద్యార్థులను ప్రోత్సహించి మా హోం కు పంపించగలరు.

గమనిక: ఈ వసతి కేవలం బాలురుకు మాత్రమే

Bittu Digitals Aler - 8919441120



## ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్ | THE HOME FOR ORPHAN STUDENTS

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.



పదవ తరగతి పై బడిన చదువుతున్న ఇంటర్మీడియట్/ఐ.టి.ఐ/ పాలిటెక్నిక్/ డిగ్రీ/ ఇంజనీరింగ్/ పారా మెడికల్ కోర్సులు/ పి.జి కోర్సులు.

A golden Opportunity for Orphaned and underprivileged students studying Intermediate, ITI, Polytechnic, Degree, Engineering, Paramedical, or PG Courses after completing 10th class.

హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న అనాథ/ పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం.

Students Studying in Government or Private Colleges in Hyderabad are Eligible.

మానవత్వం సహృదయం గల దాతల హార్థిక, ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడుచున్న సంస్థ. గత 30 సం॥లలో సుమారు 400 మంది విద్యార్థులు ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు.

With the support of kind-hearted and humanitarian donors, an organization is being run since last 30years about 400plus students studied and well setteled down happily in life.

బాలురకు మాత్రమే

ఉచిత వసతి, భోజనం, బస్‌పాస్, సౌకర్యాలతో

SCAN HERE For ADDRESS

ONLY FOR BOYS

Free Accommodation
Free Meals
Free Bus Pass
Other Essential Facilities.

అడ్మిషన్ల కొరకు పైన పేర్కొన్న అడ్రస్ లో సంప్రదించగలరు.

For Addmissions Please Contact the Address Mentioned Above

Cell: 9391221697

# తప్పిపోతారనే భయం లేదిక..





మేడారం, నవతరం: తెలంగాణా కుంభమేళాగా పేరుపొందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలంగాణా సర్కార్ శతవిధాలా ప్రయత్నం చేస్తుంది. ఈసారి మేడారం జాతరలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని భావిస్తున్నారు. దీంతో మేడారం జాతర సకల హంగులతో కొత్త రూపు సంతరించుకోబోతుంది.

### మేడారం మహా జాతరకు కమాండ్ కంట్రోల్ రూమ్

జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహోత్సవం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత వ్యవస్థలను ఉపయోగిస్తున్నారు. ఇక తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం భద్రతా ఏర్పాట్లపై సమీక్షించి, జాతరలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు.

### టీజీ క్వెస్ట్ అత్యాధునిక డ్రోన్ వ్యవస్థ

మేడారం జాతరలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, ఎవరూ తప్పిపోకుండా ప్రజలందరికీ సురక్షిత జాతర అనుభవం కలిగించేలా జాతర భద్రతను పర్యవేక్షించేందుకు 'టీజీ-క్వెస్ట్' అనే అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థ ద్వారా 30 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీ రోడ్లపై ఈ డ్రోన్లు నిరంతరం నిఘా ఉంటాయి.

### 13 వేల మంది పోలీస్ సిబ్బంది సాంకేతిక నిఘాలో విధులు

అవి మాత్రమే కాకుండా హీలియం బెలూన్లకు అమర్చిన పాన్ టిల్ట్ జూమ్ కెమెరాలు ఎత్తు నుంచి రద్దీని విశ్లేషిస్తాయి. తొక్కిసలాట జరిగే అవకాశమున్న ప్రాంతాలను ముందే పసిగట్టి అధికారులను అప్రమత్తం చేస్తాయి. దాదాపు 13 వేల మంది పోలీసు సిబ్బంది ఈ టెక్నాలజీ సర్వైలెన్స్ లో విధులు నిర్వహించనున్నారు. మేడారం జాతరలో చాలా పెద్ద సంఖ్యలో జనాలు వస్తారు కాబట్టి ఎక్కువ శాతం తప్పిపోయే అవకాశం ఉంటుంది.

### జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్

దాదాపు ఈసారి మూడు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న క్రమంలో జాతరకు వచ్చే భక్తులు ఎవరూ తప్పిపోకుండా చర్యలను చేపడుతున్నారు. గత జాతరలో దాదాపు 30 వేల మంది వరకు తప్పిపోయిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' వ్యవస్థను తీసుకు వస్తున్నారు. వొడాఫోన్-ఐడియా సహకారంతో ఈ విధానం అందుబాటులో ఉంటుంది.

### క్యూఆర్ కోడ్ గల జియో ట్యాగ్‌లతో తప్పిపోకుండా చర్యలు

పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్లలో వృద్ధులు, పిల్లల వివరాలను నమోదు చేసి వారికి క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడతారు. దీంతో వారు ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్ ను స్కాన్ చేయటం ద్వారా వారి పూర్తి వివరాలు తెలుస్తాయి. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలో అమలు చేయటానికి అధికారులు రంగం సిద్ధం చేశారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు

తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తమిళ భాషల్లోనూ వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. జాతరలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు పనిచేస్తున్నాయి. పాత నేరస్థుల గుర్తింపునకు ఆసుపత్రి ప్రాంగణాలు, పార్కింగ్ స్థలాల వద్ద 'ఫేస్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు.







# నాగోబా జాతరకు భారీ భద్రతా ఏర్పాట్లు

హైదరాబాద్, నవతరం: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఆదివారం పుష్యమాస అమావాస్య సందర్భంగా వైభవంగా ప్రారంభమైంది. మెస్రం వంశీయులు శాస్త్రోక్తంగా నిర్వహించిన నాగోబా దేవత మహాపూజతో జాతరకు ఆరంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజార్శి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ తెలిపారు. భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు జాతరకు తరలివస్తుండగా, ఈ నెల 22న దర్బార్ వంటి ముఖ్య కార్యక్రమాలు జరగనున్నాయి.

## "ఎర్ర సింధూరం యాడబాయ తల్లి" నాటకం "విజయోత్సవ" సభలో పాపారాయుడి పాత్రకు ప్రాణం పోసిన పోలయ్య కూకట్లపల్లికి సత్కారం

హైదరాబాదు: హిమాయత్ నగర్ మహర్షి వాల్మీకి సంస్థ ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులు పూర్వ మైన్స్ డైరెక్టర్ డాక్టర్ వి.డి రాజగోపాల్ అధ్యక్షతన వారు రచించిన, పల్లోలి శేఖర్ బాబు సంభాషణలు సమకూర్చి దర్శకత్వం వహించిన, ఎర్ర సింధూరం ఏడబాయతల్లి నాటకం జనవరి 1 వ తేదీన శ్రీ త్యాగరాజ గాన సభలో దిగ్విజయంగా ప్రదర్శింపడిన సందర్భంగా...ఆదివారం (18.01.2026) అల్లాయిడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో అభినందన సభ జరిగింది. కవి గాయకులు రవీంద్రబాబు అరవా కవి సమ్మేళనం చక్కగా నిర్వహించారు... ఈ సందర్భంగా దర్శకులు పల్లోలి శేఖర్ బాబును, చెన్నమ్మ పాత్రధారి ప్రియాంకను స్వరసమ్రాట్ శరత్ చంద్రను వారి కళను ప్రతిభను శ్లాఘిస్తూ డా.వి.డి రాజగోపాల్ ఘనంగా సన్మానించారు ఈ సభకు డా. మహమ్మద్ రఫీ జర్నలిస్టు, రామకృష్ణ చంద్రమౌళి, సాధనాల వెంకటస్వామి నాయుడు, ఆశాలత, రామలక్ష్మి, డా.శాంతిశ్రీ, యం.కె.గాంధీ, కె.వి.యస్.రెడ్డి, డా. వందనం హాజరై..నటీ నటులందరూ అద్భుతంగా నటించి తమ తమ పాత్రలకు న్యాయం చేశారంటూ అభినందిస్తూ నాటకాన్ని అద్భుతంగా సమీక్షిస్తూ



మెరుగులు దిద్దుకునేందుకు చక్కని సూచనలు చేసి ఈ నాటకాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రదర్శించాలన్నారు

ఈనాటకంలో పాపారాయుడి పాత్రలో అద్భుతంగా నటించి అందరి ప్రశంసలు అందుకున్న పోలయ్య కవి కూకట్లపల్లి నాటకాన్ని సమీక్షిస్తూ నాటకంలో ప్రేక్షకులు ఊహించని కొన్ని ట్విస్ట్ లుండాలన్నారు.

**"ఎవడ్రా వీడు పానకంలో పుడక.**

**"వాడు పెద్దోడు పానకంలో**

**"పుడక కాదు పక్కలో బల్లెం...**

**"మద్దిలేటి కొడుకా మజాకా....**

**"ముఠా కక్షలకు ముద్దుబిడ్డ...**

**"కొలిమి గుండ్ల కోడెనాగు...**

**"ఖర్చు నాది...కుర్చీనీది...**

**"భయపడకు బీసీ బిడ్డా...**

**"ఇది పాపారాయుడు అడ్డా...**

**ఇక నుండి...**

**"నరుక్కోవడాలుండవు నవ్వుకోవడాలే**

**"కత్తిపోట్లుండవు**
**కౌగిలించుకోవడాలే...**

**"చాలు చాలు ఇక నుండి**

**"ఈ కుట్రలకు ఈ కుతంత్రాలకు...**

**"ఈ ముఠా కక్షలకు...**

**"ఈ రాక్షస రాజకీయాలకు...**



**"ఈ రక్తసింధూరానికి**

**"ముగింపు పలుకుదాం...**

అంటూ కొన్ని పవర్ ఫుల్ పంచ్ డైలాగ్స్ వినిపించి అందరినీ అలరించారు ఆకట్టుకున్నారు మధ్యలో సమీక్షకులను, నటీనటులను, కవితాగానం చేసిన వారిని, చివరలో పాపారాయున్ని డా వి.డి రాజగోపాల్ ఆత్మీయంగా సత్కరించారు. రుచికరమైన విందుతో సభ దిగ్విజయంగా ముగిసింది.

## పెళ్లి పేరుతో మోసం... ఎస్సై కి పదేళ్ల జైలు



గుంటూరు, నవతరం: వివాహం పేరుతో యువతిని నమ్మించి గర్భవతి అయిన అనంతరం ఆమెను మోసగించిన కేసులో ఎస్ఐకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ గుంటూరులోని నాల్గో అదనపు న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారండ అప్పట్లో నగరంపాలెం ఎస్ఐగా పనిచేస్తున్న కుంచాల రవితేజకు, బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేసి ఎయిమ్స్ ప్రవేశ పరీక్షకు శిక్షణ నిమిత్తం గుంటూరులోని ప్రైవేటు మహిళా వసతి గృహంలో ఉంటున్న పల్నాడు జిల్లాకు చెందిన ఒక యువతికి 2023లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. ఆమెను ప్రేమిస్తున్నట్లు ఎస్ఐ నమ్మించారు. ఏడాది పాటు ఆమెతో కలిసి మెలసి తిరిగి, వివాహం చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశారు. దీనిపై బాధితురాలు 2023 మే 8న జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. గర్భం తొలగించేందుకు యువతికి రవితేజ వివిధ రకాల మందులు వినియోగించడంతో తనకు అబార్షన్ జరిగినట్లు ఈ ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. దీనిపై ఎస్‌పి ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన పోలీసులు మే 20న నగరంపాలెం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. పశ్చిమ విభాగం డిఎస్‌పి బి.ఉమా మహేశ్వరరెడ్డి దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. రవితేజపై నేరం రుజువు కావడంతో ఆయనకు పదేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఎస్‌కె మోబీనా బేగం వాదనలు వినిపించారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా అమృతలూరులో ఎస్ఐగా రవితేజ పనిచేస్తున్నారు.

### మహిళా ఎస్ఐపై శాఖాపరమైన విచారణకు ఆదేశం

ఈ కేసు విచారణలో భాగంగా బాధితురాలి నుండి నగరంపాలెం అప్పటి మహిళా ఎస్ఐ కె.రోజాలత స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయడంతోపాటు వీడియో ద్వారా రికార్డు చేశారు. అయితే, కోర్టు విచారణ సందర్భంలో ప్రాసిక్యూషన్‌కు విరుద్ధంగా సాక్ష్యం చెప్పండంతో ఆమెపై శాఖాపరమైన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి తన తీర్పులో జిల్లా ఎస్‌పిని ఆదేశించారు.



## సుప్రీంకోర్టు కొట్టేసిన కేసుకు సిట్ నోటిసులా..?

### సింగరేణి బొగ్గు స్కాం బయట పెట్టినందుకే ఈ డైవర్షన్ పాలిటిక్స్

### ధర్మబద్ధంగా ఉన్నాం కాబట్టే సిట్ కు హాజరవుతున్నామన్న హరీష్‌రావు



హైదరాబాద్, నవతరం: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును సిట్ విచారణ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డా రేవంత్ రెడ్డి.. నువ్వు ఎన్ని నోటీసులు పంపినా, ఎన్ని విచారణలకు పిలిచినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు నిన్ను విడిచి పెట్టేది లేదు. నీ తాటాకు చప్పుళ్లకు బీఆర్ఎస్ పార్టీ భయపడదని, వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో నీకు ప్రజలు దిమ్మదిరిగే విధంగా జవాబు చెబుతారు చూస్కో అని అన్నారు. గౌరవ కేసీఆర్ సార్ నాయకత్వంలో రాటు దేరిన కార్యకర్తలం, బయమెరుగని ఉద్యమకారులం మేము అని అన్నారు. మీరెన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసిన ప్రజలు అన్ని గమనిస్తారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై కవిత ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పలేకపోతున్నారు :: అద్దంకి దయాకర్

ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారని, ఆమె వేసిన ప్రశ్నలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావును సిట్ విచారిస్తోంది. విచారణకు హాజరు కావడానికి ముందు హరీశ్ రావు చేసిన విమర్శలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావు బాధితుడైతే వివరాలు చెప్పాలని, బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసు కొత్తదేమీ కాదని, గత రెండేళ్లుగా దీనిపై విచారణ సాగుతోందని అన్నారు. హరీశ్ రావు తనకు తాను పోరాట యోధుడిలా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు ఫోన్లు ట్యాప్ చేయించారని ఆరోపించారు. ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పారని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ అంటూ కాంగ్రెస్ డ్రామాలు చేస్తోందని హరీశ్ రావు అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డిని ఎలా వేధించారో అందరికీ తెలిసిందేనని అన్నారు. ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హరీశ్ రావుకు నిజాయతీ ఉంటే ప్రజల సొమ్మును దోచుకోలేదని ప్రమాణం చేయాలని వారు అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పు చేయకుంటే విచారణను ఎదుర్కోవడానికి భయమెందుకని ప్రశ్నించారు. తాము కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ నేతలు బయట కూడా తిరగలేరని వారు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అధికారులతో తప్పుడు పనులు చేయించి వారిని అబాసుపాలు చేశారని అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి కేసీఆరే కారణమని ఆరోపించారు. తప్పు చేసిన వారికి ఎవరికైనా శిక్ష పడటం ఖాయమని అన్నారు.

# జ్యూరిచ్ చేరుకున్న రేవంత్ బృందం





స్విట్జర్లాండ్ / హైదరాబాద్, నవతరం: వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు 2026లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరానికి చేరుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రతినిధి బృందానికి జ్యూరిచ్ విమానాశ్రయంలో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్, ఇతర అధికారులు జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి కి ఆత్మీయ స్వాగతం పలికి, మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. మరోవైపు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇప్పటికే దావోస్‌కు చేరుకున్నారు. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో తెలంగాణ ప్రతినిధి బృందం పాల్గొననుంది. సమావేశాల తొలి రోజున వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ కంపెనీల పారిశ్రామికవేత్తలతో జరిగే సమావేశాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' రోడ్‌మ్యాప్‌ను ప్రపంచ వేదికపై పరిచయం చేయనున్నారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులకు



ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. డిసెంబర్‌లో ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లో ప్రతిపాదించిన అభివృద్ధి నమూనాకు అనుగుణంగా సుస్థిర పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ డబ్ల్యు.ఈ.ఎఫ్. 2026లో తన అజెండాను ముందుకు తీసుకెళ్లనుంది.




# మళ్ళీ మళ్ళీ అధికారం కట్టబెడతారు?

స్పెషల్ కరెస్పాండెంట్, నవతరం: కర్ణాటకలో రాసలీలల డిజిపి స్థాయి అధికారి రామచంద్రరావు సస్పెండ్ అయ్యారు. ఆయన ఇదివరకే సినీ నటి, తన సవతి కూతురు రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో ప్రమేయం ఉందని నిర్ధారణ అయిన తర్వాత మళ్లీ అతడిని అదే స్థాయిలో అధికారిగా నియమించడమే తప్పు . రాసలీలల డిజిపి రామచంద్రావు గతంలో బంగారం స్మగ్లింగ్ కేసులో, దొరికిపోయిన కన్నడ సినీ నటి రమ్య రావుకు సవతి తండ్రి, ఆమె తల్లిని అతడు వివాహం చేసుకున్నాడు . తన సవతి తండ్రి రామచంద్రరావు డిజిపి స్థాయి పదవిని అడ్డం పెట్టుకొని రన్యారావు విమానాల్లో బంగారం స్మగ్లింగ్ కు పూనుకుంది. గల్ఫ్ దేశాల నుంచి కిలోల కొద్ది బంగారం తీసుకొచ్చేది. బెంగళూరు కెంపెగౌడ విమానాశ్రయంలో తండ్రి పదవి అడ్డం పెట్టుకొని లగేజి చెకింగ్ లేకుండా బయటకు వచ్చేది. ఇలా మూడు నెలల్లోనే ఆమె అనేకసార్లు గల్ఫ్ దేశాలకు పోయినట్టు, చెకింగ్ లేకుండా బయటకు వచ్చినట్టు రికార్డులు స్పష్టం చేశాయి. .ఇదంతా చూసిన డిఆర్ఐ అధికారులు ఒకరోజు ఆమెను చెక్ చేయగా 14 కిలోల బంగారంతో పట్టుబడింది. అయితే తన కూతురు వ్యాపారంతో తనకే సంబంధం లేదని రామచంద్రరావు తప్పించుకున్నాడు. అయినప్పటికీ అతని ప్రమేయం ఉందని తెలుసుకున్న తర్వాత అతన్ని నిర్బంధ సెలవులో ప్రభుత్వం పంపించింది . ఇదే సాధారణ అధికారయితే




సస్పెండ్ చేసి జైలుకు పంపేవారు. కానీ డిజెపి స్థాయి అధికారి కాబట్టి అతడిని సెలవుపై మాత్రమే పంపించి రెండేళ్లు జీతం ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ పోస్టింగ్ ఇచ్చి పౌర హక్కుల చట్టం అమలు విభాగానికి డీజీపీగా చేశారు. అయినప్పటికీ తన నీచ బుద్ధి పోనిచ్చుకోకుండా ఆఫీసులోనే రాసలీలలు మొదలుపెట్టారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ముగ్గురు కాదు పలువురు మహిళలతో ఆఫీసులోనే అసభ్యంగా బ్లూ ఫిల్ములు తలపించే విధంగా అతని చేసిన రాసలీలలు వీడియో రూపంలో బయటికి రావడంతో సంచలనమైంది. ఇప్పుడు ఎట్టకేలకు ప్రభుత్వం అతనిని సస్పెండ్ చేసింది. ఒక కేసులో దొంగని తేలిన తర్వాత మళ్లీ అతడిని అదే పదవిలో కొనసాగించడం మళ్ళీ ఇలాంటి నీచ కార్యక్రమాలుకు పాల్పడడం చూస్తుంటే ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది . ఎలాగోలాగా మళ్లీ ఉద్యోగాల్లోకి వచ్చేస్తారు అన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో కూడా ఉంది.

# ఆలయాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం

## లక్డారం అయ్యప్ప స్వామి స్లాబ్ నిర్మాణ పనులు పరిశీలన చేసిన నీలం మధు ముదిరాజ్



సంగారెడ్డి, నవతరం: పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని నూతన దేవాలయాల నిర్మాణానికి పురాతన దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నానని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం నాడు ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ స్లాబ్ పనులను ఆయన పరిశీలించారు. అంతకుముందు కొబ్బరికాయ కొట్టి స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలతో గ్రామాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని తెలిపారు. హరిహర సుతుడు అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం లక్డారంలో చేపట్టడం సంతోషకరమన్నారు. ఇప్పటికే తనవంతుగా సహాయంగా ఆలయ నిర్మాణం కోసం విరాళం ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆలయ నిర్మాణానికి చొరవ తీసుకున్న ఆలయ కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు తన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




# 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాదంటే అగ్నిగుండమే

## బీసీ రిజర్వేషన్ల కేసు కోర్టులో ఉండగా.... మున్సిపల్ ఎన్నికలకు ఎట్లా పోతారు?

హైదరాబాద్, నవతరం: రిజర్వేషన్ల బిల్లు కోర్టులో ఉండగా మున్సిపల్ ఎన్నికలకు పోవాలని ప్రభుత్వం ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధం అని బీసీ జేఏసీ తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్ అన్నారు. మంగళవారం వేంసురు లో జరిగిన సమావేశం లో అయన మాట్లాడుతు రిజర్వేషన్ల అంశంపై తీర్పు వచ్చేవరకు వేచి ఉండకుండా.. ఎన్నికలకు పోవడం బీసీలను దగా చేయడమే అవుతుందన్నారు. ప్రభుత్వం మొదటి నుండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ ఊరించే మోసం చేసిందని మండిపడ్డారు. అధికారులు ప్రకటించిన లెక్కల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను 28% కుదించారని ఆరోపించారు. బీసీలకు 65 మున్సిపాలిటీలకు గాను 35 స్థానాలు, కార్పొరేషన్లలో 10 స్థానాలకు గాను 3 మాత్రమే కేటాయించారు అన్నారు. దీనిపై ప్రతిపక్షాలు ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల కేసు కోర్టును తప్పక విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసు కొలిక్కి వచ్చే వరకు మున్సిపల్ ఎన్నికలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు రాజకీయంగా ఆర్థికంగా ఎంతో వెనకబడి ఉన్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల బీసీలను వాడుకొని వదిలేస్తున్నాయన్నారు. బీసీలకు విద్య,ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే దిశగా పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు తెలిపారు.





# ట్రాఫిక్ సిబ్బందికి గాగుల్స్ అందజేత

హైదరాబాద్, నవతరం: సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావు భూపాల్, ఐపీఎస్ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లో గాగుల్స్ అందజేశారు. రోడ్లపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కి కాలుష్యం, ఎండ నుంచి రక్షణ కోసం గాగుల్స్ అందజేశామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంత రావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, కూకట్ పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సబ్ ఇన్ స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# పంచాయితీ రాజ్ చట్టాలకు లోబడి పనిచేస్తాం

## ::: గ్రామ పంచాయితీ సర్పంచులకు శిక్షణ తరగతులు

మణుగూరు, జనవరి 20,నవతరం: మణుగూరు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో.. సర్పంచులకు ఇస్తున్న శిక్షణ తరగతులు. ప్రజల కోసం.. ప్రజా శ్రేయస్సు కోసం.. పంచాయితీ అభివృద్ధి కోసం.. పాలన విధానాన్ని అవలంభించడం కోసం.. పంచాయితీ ప్రజలకు సుపరిపాలన అందించుటకొరకు సోమవారం నుండి కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఇచ్చు సర్పంచ్ శిక్షణ తరగతులకు రెండోవరోజు హాజరైన మణుగూరు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీ సర్పంచులు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. నాడు చదివిన చదువు వల్ల వ్యక్తిగతంగా ఎవరికి ఉపయోగ పడకపోవచ్చు ఏమోగాని, నేడు సర్పంచ్ గా గెలిచి ప్రజలకు, గ్రామ పంచాయితీ అభివృద్ధికి సేవ చేసే అదృష్టం ఒక వరంలా వచ్చింది. ఈ యొక్క అదృష్టాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని మా వంతు సహాయ సహకారాలు ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ యొక్క శిక్షణ తరగతులకు హాజరై మరెంతో అభివృద్ధి కి పంచాయితీ రాజ్ చట్టాలకు నిబంధనలకు లోబడి పని చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అశ్వాపురం ఎంపిఓ జి ముత్యాలరావు (ట్రైనింగ్ మాస్టర్), మణుగూరు మేజర్ పంచాయితీ సర్పంచ్ కలబోయిన మాధారావు (సమితి సింగారం), విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, కూనవరం సర్పంచ్ ఏనిక స్వేత, ముత్యాలమ్మ నగర్ సర్పంచ్ జంపేశ్వరి, లంకమల్లారం సర్పంచ్ పూనెం రమేష్, కట్టుమల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, గుట్టమల్లారం కారం పూజిత, తోగ్గుడెం మడకం క్రిష్ణ, పగిడేరు సర్పంచ్ కుంజ శ్రావణ్ కుమార్, సాంబాయిగూడెం సర్పంచ్ చిడెం ఉషారాణి, దమ్మక్కపేట సర్పంచ్ మడి స్వరూప, తిర్లపూరం పాయం చిట్టెమ్మ, రామనుజారం సర్పంచ్ కాలం కల్పన తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో హైడ్రా చర్యలు భేష్

## హైడ్రా కార్యకలాపాల పట్ల స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం ఆసక్తి







హైదరాబాద్, నవతరం: సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి ఎంతో ముఖ్యమో పర్యావరణ పరిరక్షణా అంతే అవసరమని స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం – 2026 అభిప్రాయ పడింది. మెరుగైన, ఆరోగ్యకర జీవనాన్ని సాగించాలంటే పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేయాలని పేర్కొంది. ఈ దిశగా హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) చేస్తున్న కృషిని అభినందించింది. “ది గ్రేట్ ఇంటిగ్రేషన్: టెక్నాలజీ, టాలెంట్ అండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఇన్ ఆసియా” అనే అంశంపై తాజ్ ఫలక్‌నుమాలో స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం – 2026 నిర్వహించిన సమావేశంలో ఐటీ, విద్యా సంస్థలతో పాటు.. పలు రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరై హైడ్రా కార్యకలాపాల పట్ల ఆసక్తి కనబర్చారు. హైడ్రా కార్యకలాపాలను కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరించారు. పర్యావరణ హితమైన నగరం హైడ్రా అభిమతమని.. ఇందుకు గాను చెరువులు.. వాటిని అనుసంధానం చేసే వరద కాలువలను పరిరక్షిస్తున్నామన్నారు. హైడ్రా అంటే ఆక్రమణల తొలగింపు సంస్థ మాత్రమే కాదని.. ప్రజా ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, విపత్తు నిర్వహణ, పట్టణ భద్రత అనే విస్తృత లక్ష్యాలున్నాయన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా ప్రజా ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ 1,350 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడామన్నారు. వీటి విలువ సుమారు రూ.65 వేల కోట్ల వరకూ ఉంటుందన్నారు. ముందస్తు చర్యలతో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నగరాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభతో ఆసియా దేశాల అభివృద్ధి ఎంత అవసరమో.. పర్యావరణ హితమైన నగరాలను తీర్చిదిద్దడమూ అంతే ముఖ్యమని పలువురు ఈ సందర్భంగా ప్రస్తావించారు. చెరువుల పునరుజ్జీవనం, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపొందించడానికి హైడ్రా చేపట్టిన చర్యలు ప్రశంసనీయమన్నారు. చట్టాలు అనేకం ఉన్నా వాటి అమలులో అలసత్వంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని నగర జీవనం దుర్భరంగా మారుతున్న దశలో హైడ్రా దిక్సూచిగా మారిందని కొనియాడారు. స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం – 2026 ఫౌండర్ దీప్షికా కుమార్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, కియోలిస్ హైదరాబాద్ మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రీనాదాస్, టీసీఎస్ ప్రతినిధి చంద్రమోహన్ మల్లాది, మైక్రోసాఫ్ట్ ప్రతినిధి ఆసిష్ బాబర్ తో పాటు పలు విద్యా సంస్థలు, కంపెనీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

# దుర్గంచెరువు దుర్గంధంపై హైడ్రా నజర్

## సమన్వయంతో సమస్య పరిష్కారానికి చర్యలు

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్





హైదరాబాద్, నవతరం: మాధాపూర్ గుట్టల్లో ఉన్న దుర్గం చెరువు దుర్గంధంపై హైడ్రా దృష్టి పెట్టింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. దుర్గంచెరువులో గుర్రపు డెక్క వ్యాప్తి చెందడం.. దుర్గంధంగా మారడంపట్ల మీడియా కథనాలు, స్థానికుల నుంచి హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం దుర్గం చెరువును పరిశీలించారు. చెరువులో సగభాగం వరకూ గుర్రపు డెక్క వ్యాపించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఎస్‌టీపీలు ఉన్నప్పటికీ వరద కాలువ ద్వార మురుగు నీరు నేరుగా దుర్గం చెరువులోకి కలవడం పట్ల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌టీపీలకు వెళ్లే మురుగు నీరు అధికంగా ఉండడంతో ఇటువైపు మళ్లించాల్సి వచ్చిందని అక్కడ ఇరిగేషన్ ఇంజినీర్లు చెప్పగా అది సరికాదన్నారు. ఎస్‌టీపీల సామర్థ్యానికి మించిన మురుగు నీరు వస్తే మురుగు కాలువకు మళ్లించాలి కాని.. నేరుగా చెరువులోకి ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఒకవైపు ఎస్‌టీపీ ద్వారా మురుగు నీటిని సుద్ధి చేసి చెరువులోకి పంపడం.. మరో వైపు నేరుగా మురుగు నీరు వదిలేయడం ఏంటని మండిపడ్డారు.

### సమన్వయంతో పని చేయాలి

చెరువును అభివృద్ధి చేయడం అంటే పైపై మెరుగులు దిద్దడం కాదని దుర్గం చెరువు పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రశ్నించారు. చెరువులోకి మురుగు నీరు కలవడం.. గుర్రపు డెక్క వ్యాప్తి చెందడాన్ని నియంత్రించడానికి మీ వైపు చేసిన ప్రయత్నాలు ఏంటని అడిగారు. జీహెచ్ ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖ, రహేజా మైండ్‌స్పేస్, ఎస్‌టీపీల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం, బాధ్యత పడకపోవడమే దుర్గం చెరువు దుర్గంధానికి కారణమని హైడ్రా కమిషనర్ తెలిపారు. చుట్టుపక్కల మురుగు నీరంతా ఎస్‌టీపీ లైన్లోకి వెళ్లేలా జాగ్రత్త పడాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌టీపీల వద్ద మురుగు నీరు శుభ్రం అయిన తర్వాత నీటి నమూనాలను సేకరించి పరీక్షలకోసం పీసీబీకి పంపాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు.

### సంబంధిత శాఖల అధికారులతో సమావేశం

దుర్గం చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం హైడ్రా కార్యాలయంలో చెరువు పరిరక్షణ బాధ్యతలు చేపట్టిన అన్ని సంస్థలతో హైడ్రా కమిషనర్ సమావేశమయ్యారు. వరద కాలువలోకి మురుగు నీరు వెళ్లకుండా పైపులైను డైవర్షన్ పనులు చేపట్టడానికి జలమండలికి ఉండే ఇబ్బందులను తొలగించారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం. రమేష్ తో మాట్లాడి ట్రాఫిక్ డైవర్షన్‌కు సహకరించాలని సూచించారు. అలాగే ఇరిగేషన్, విద్యుత్, జీహెచ్ ఎంసీ, జలమండలి విభాగాధికారులతో కూడా మాట్లాడి మురుగునీరు దుర్గం చెరువులోకి చేరకుండా చేపట్టే పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఇదే సమయంలో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడి ఇన్ ఆర్బిట్ మాల్, నెక్టర్ గార్డెన్స్ ఇలా పై భాగంలోని ఐటీ సంస్థల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి కలవకుండా చెరువుకు ఆనుకుని పడమర వైపు కాలువను తవ్వేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కుసంగి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

## హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు

నవతరం, టేక్మాల్: మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామంలో స్థానిక గ్రామపంచాయతీ వద్ద ఎంఎన్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో ఉచిత ఆపరేషన్లు కంటి ఆపరేషన్లు గడ్డలు కంతులు అర్షమొలలు వంటి పలు వ్యాధులకు వివిధ జనరల్ సర్జరీల పరీక్షల కోసం గ్రామస్తులు పరీక్ష చేసుకోగా వీరిలో కొంత మందికి డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్య చికిత్స కోసం ఎంఎన్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు రెఫరెంట్ చేయడం జరిగింది. ఉచిత వైద్య సేవలు చేయడం జరుగుతుందని ఈ వైద్య శిబిరానికి సహకరించిన ఎంఎన్ఆర్ ఆస్పత్రి యాజమాన్యానికి వైద్య బృందానికి గ్రామం తరపున యువకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, ఉప సర్పంచ్, సుబ్బారావు,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గ్రామ పెద్దలు నారాయణ గౌడ్, వెంకట్, శ్రీనివాస్, లక్ష్మయ్య, రాంరెడ్డి, అడివయ్య, రమేష్, ఆంజనేయులు, యాద గౌడ్, అనిల్ గౌడ్, యాదయ్య, ఏంఎన్ఆర్, వైద్య బృందం పలువురు పాల్గొన్నారు.





# చల్లపల్లి జీపీ నూతన బిల్డింగ్ భూమి పూజ

టేక్మాల్, నవతరం: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో ఎన్ఆర్జీఎస్ లో 20 లక్షలతో నిధులతో చల్లపల్లి గ్రామానికి నూతన గ్రామపంచాయతీకి భూమి పూజ చేయడం జరిగింది నూతనంగా ఏర్పడిన చల్లపల్లి గ్రామపంచాయతీకి నూతన బిల్డింగ్ మంజూరు చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కు గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామపంచాయతీ నూతన భవనం మంజూరు కావడానికి కృషిచేసిన టేక్మాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిప్యూటీ డిఈ ప్రభాకర్, పంచాయత్ రాజ్ ఏఈ వెంకట్, టేక్మాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మరమేష్, గ్రామసర్పంచ్ సంగీత, కార్యదర్శి మదన్ లాల్, ఆర్టీఏ మెంబర్ మల్లారెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు యాదయ్య, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ పాపయ్య టేక్మాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భక్తుల కిషోర్ సాగర్, శంకర్, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, వార్డు సభ్యులు శ్రీనివాస్, కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# గత,ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులను దగా చేసింది

## ఉద్యమకారుల సమస్యలపై కవితక్కకు అధ్యయన నివేదిక అందజేత

## ఉద్యమకారుల సంక్షేమం కోసం కవితక్క చేస్తున్న పోరాటానికి ఉద్యమకారుల సంపూర్ణ మద్దతు: కప్పాటి పాండురంగారెడ్డి

నవతరం బ్యూరో చీఫ్ : తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలు, అలాగే ఉద్యమ సమయంలోనూ, ప్రస్తుతం వారు అనుభవిస్తున్న కష్టనష్టాలపై ‘తెలంగాణ జాగృతి ఉద్యమకారుల సంక్షేమ కమిటీ’ గత పది రోజులుగా విస్తృత అధ్యయనం చేసింది. ఈ అధ్యయనంలో రూపొందించిన సమగ్ర నివేదికను సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కి, స్టీరింగ్ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కమిటీ సభ్యులు, తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ములుగు జిల్లా అధ్యక్షుడు నంగావత్ రాజేష్, శీలం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులపై ప్రభావం చూపుతున్న సామాజిక, ఆర్థికపరమైన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన సూచనలను ఈ అధ్యయన నివేదికలో పొందుపరిచినట్లు తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితక్క నిరంతరం పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, గతంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చకుండా వారిని దగా చేసిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కవితక్క చేపట్టే పోరాటానికి రాష్ట్రంలోని ఉద్యమకారులు, ఉద్యమ సంఘాలు సంపూర్ణ సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు.

# నన్ను కాపాడటానికి ఎవరూ లేరు: రేణు దేశాయ్

## తన తప్పు లేకపోయినా తనను విమర్శిస్తున్నారన్న రేణు

## నేను నమ్మే భగవంతుడికే నా బాధ చెప్పుకుంటానని వ్యాఖ్య

## వీధి కుక్కల విషయంలో తన పోరాటం కొనసాగుతుందన్న రేణు



వీధి కుక్కలను చంపడంపై గళమెత్తిన నటి రేణూ దేశాయ్ మరోసారి భావోద్వేగంగా స్పందించారు. తనను కాపాడటానికి ఎవరూ లేరంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ అంశంపై తాను చేసిన వ్యాఖ్యలకు తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రేణు స్పష్టం చేశారు. కాశీలో గంగానదిలో బోటింగ్ చేస్తున్న వీడియోను షేర్ చేసిన ఆమె, “నన్ను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరు. అయినా నా తప్పు లేకపోయినా ఎంతోమంది నన్ను విమర్శిస్తున్నారు. వాటికి తిరిగి సమాధానం చెప్పే ఉద్దేశం నాకు లేదు. నేను నమ్మే భగవంతుడికే నా బాధ చెప్పుకుంటాను. ఆయన నా ప్రార్థనలు వింటాడన్న విశ్వాసం ఉంది. నేను తరచూ కాశీకి ఎందుకు వస్తానో ఇప్పుడు అర్థమవుతుందేమో” అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. అలాగే వీధి కుక్కల విషయంలో తన పోరాటం కొనసాగుతుందని రేణూ మరోసారి స్పష్టం చేశారు. “నేను ఎప్పుడూ నా వ్యక్తిగత హక్కుల కోసం పోరాడలేదు. కానీ, కొన్ని కుక్కల తప్పు కారణంగా వందల సంఖ్యలో వాటిని చంపడం సరైన నిర్ణయం కాదు. ఈ విషయాన్ని సమాజం అర్థం చేసుకునే వరకూ నా పోరాటం ఆగదు” అని తేల్చిచెప్పారు. తాను ఒక రాజకీయ పార్టీలో చేరనున్నట్లు వచ్చిన వార్తలను కూడా ఆమె ఖండించారు. తనకు అలాంటి ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టతనిస్తూ, ఇది పూర్తిగా జంతు హక్కుల కోసం చేస్తున్న పోరాటమేనని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.





**అశ్వారావుపేట మండలంలో పులి సంచారం**

**ఆవు దూడలను బలి తీసుకున్న వైనం**

**అడవులను కొట్టి అడవి మృగాలను ఉసిగొలుపుతున్న పాపం మనిషిదే**

**అశ్వారావుపేట ఫారెస్ట్ అధికారి**

# అడవులు నిర్వీర్యం అడవి మృగాలు ఊరూరా



నవతరం ఖమ్మం భద్రాద్రి జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, కావడి గుండ్ల గ్రామంలో సోడం నాగేశ్వరరావు పశువుల మందలో ఆవు దూడలను పులి మింగేసిందని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. చచ్చిపడి ఉన్న జీవుల కళేబారాలు పూర్తిగా విచ్ఛిన్నమయ్యాయి. నాటా నోటా అటవీ శాఖ అధికారులకు విషయం తెలియడంతో దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో చనిపోయిన పశు వుల మధ్య పులి పాదజాడలు కనిపించడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. పశువుల రక్తాన్ని త్రాగి వెళ్లిపోయిన పులి మరలా తిరిగి వచ్చి మాంసాన్ని తింటుంది అనుకుంటున్న స్థానికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రస్తుత కాలంలో అడవులు నిర్వీర్యం అయిపోతుండడంతో అడవిలో నివసించే క్రూర మృగాలు ఆహారం దొరక్క అటవీ ప్రాంత గ్రామాలపై దాడి చేస్తుండడం ఒకరకంగా ప్రకృతి వైపరీత్యమే,,. అడవులను కొట్టి అడవి మృగాలను ఉసిగొలుపుతున్న తీరు భావితరాల్లో మనుషులపై మచ్చగానే మిగిలిపోయే అవకాశం ఉంది. నేడు పశువులు, మరునాడు మనం,మన బిడ్డలు క్రూర మృగానికి బలి కావాల్సి రావచ్చు. దీనంతటికీ మూల కారణం మనిషే. ప్రకృతిని దాని ఎదుగుదలను మనం కాపాడుకోకపోతే ఆ ప్రక్కోవ మనల్ని మట్టిలో కలిపేస్తుంది. అందుకే అడవులను సంరక్షించుకుందాం,,. పర్యావరణాన్ని కాపాడుకుందాం,,. మనం మంచి వాళ్ళం అయితే ప్రకృతి అదే మనకు సహాయం చేస్తుంది అంటూ అశ్వరావుపేట ఫారెస్ట్ అధికారి ఈ సందర్భంగా తెలియజేశారు. త్వరలోనే పులి జాడను కనిపెట్టి, పట్టుకుంటామని, ప్రజలు అప్పటివరకు జాగ్రత్తగా ఉండాలని, పూర్తిగా ఈ ఆపరేషన్ సక్సెస్ అయితే చుట్టుపక్కల గ్రామస్తులకు క్షేమకర సూచనలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. అప్పటివరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# వీబీ-జీరామ్ జీ చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తాం

**డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న..**

**ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి కుట్ర చేస్తున్న మోడీ**

**కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి**

**దమ్మపేట మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం**




నవతరం ఖమ్మం భద్రాద్రి జిల్లా : వీబీ-జీరామ్ జీ చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మండిపడ్డారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ సహా పలువురు నేతలతో కలసి పాల్గొన్న ఆమె మాట్లాడుతు పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యూపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. స్కీమ్ ను మార్చడమంటే పేదల పొట్టకొట్టడమేనని విమర్శించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం చట్టం తేవడం దుర్మార్గమన్నారు. ఈ చట్టం తేవడం మూలంగా పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదన్నారు. పేదలను శిక్షించేలా కేంద్రం విధానం ఉన్నదని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీరామ్ జీ)గా మార్చే బిల్లును తప్పుబట్టిన ఆమె గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం వలసలను తగ్గించడం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడంలాంటి గొప్ప లక్ష్యాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. గతంలో వందశాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి మిగిలిన 40శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్రప్రభావం చూపే నిర్ణయమని కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేసి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పనిదినాలను పెంచామని చెబుతూ కూలీల సంఖ్య పెద్ద ఎత్తున కుదించడం సరికాదని గతంలో ఉన్న బిల్లులో 90శాతం కేంద్రం ఇచ్చే నిధుల్ని 60 శాతానికి కుదించి మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్రాలే భరించాలని పేర్కొనటం దారుణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అతి జోక్యంతో ఇప్పటికే నిధుల లేమితో అల్లాడుతున్న చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తేసే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. 26 వ తేదిన గ్రామ సభలు పెట్టి తీర్మానాలు చేసి కొత్త చట్టం రద్దు కోసం కేంద్రానికి పంపాలన్నారు.

# కడిగిన ముత్యంలా బయటకు వస్తాడు

**రోజుకో కేసు పేరుతో రేవంత్ డ్రామా**

**కుట్రలు, కేసులతో బీఆర్ఎస్ పోరాటాన్ని ఆపలేరు**

**సింగరేణి కుంభకోణం బయటపెట్టినందుకే హరీష్ రావుకు సిట్ నోటీసులు**

**కుంభకోణాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు**

**హామీలు అమలు చెయ్యలేక డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు**

**మాజీ మంత్రి హరీష్ రావు వెంట యావత్ తెలంగాణ సమాజం ఉంది**

**రాష్ట్ర ప్రభుత్వ కుంభకోణాల పై సిట్ వెయ్యాలని డిమాండ్**

**శేరిలింగంపల్లి యువ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత చిర్రా రవీందర్ యాదవ్ స్పష్టం**



శేరిలింగంపల్లి, నవతరం: సింగరేణి బొగ్గు గనుల కాంట్రాక్ట్ కుంభకోణం బయటపెట్టినందుకే హరీష్ రావుకు సిట్ నోటీసులు ఇచ్చిందని శేరిలింగంపల్లి యువ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ లీడర్ చిర్రా రవీందర్ యాదవ్ అన్నారు. రెండేళ్ల నుంచి మంత్రులు అనేక కుంభకోణాలకు పాలపడుతున్నారని ఆరోపించారు. కుంభకోణాలను ఎప్పటికప్పుడు బయటపడుతూనే ఉంటామని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ శాసన సభ వేదికగా, ప్రజా క్షేత్రంలో బయట పెడుతుంటే కేసులు పెడుతున్నారని చెప్పారు. ఒకసారి కాళేశ్వరం కేసు అని, ఇంకో సారి ఈ కార్ రెస్ అని, మరోసారి విద్యుత్ కేసు అని విచారణ పేరుతో పిలుస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని సార్లు నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను నిలదీస్తూనే ఉంటామని చిర్రా రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో దండుపాళ్యం ముఠా ప్రభుత్వాన్ని నడిపిస్తుందని విమర్శలు చేశారు. సమ్మక్క సారక్క టెండర్ల విషయంలో మంత్రుల మధ్య కొట్లాట జరిగిందన్నారు. పారిశ్రామిక భూములను రేవంత్ రెడ్డి బంధువులకు అప్పగిస్తున్నారని చెప్పారు. హ్యామ్ రోడ్ల పేరుతో కుంభకోణం జరగబోతుందని ఆరోపించారు. రూ. 1600 కోట్ల విలువైన బొగ్గు గనుల కాంటాక్ట్ విషయంలోనే ముఖ్యమంత్రి, మంత్రులకు మధ్య గొడవలు జరిగాయాన్నది జగమెరిగిన సత్యం అన్నారు. రోజుకొక కుంభకోణాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ కుంభకోణాల పై సిట్ వెయ్యాలని డిమాండ్ చేశారు. టీవీ సీరియల్ లా రోజుకో కేసు పేరుతో డ్రామా నడిపిస్తున్నారని చిర్రా రవీందర్ యాదవ్ మండిపడ్డారు. తాము ప్రశ్నిస్తుంటే మా పై కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత డైవర్షన్ పాలిటిక్స్ చేసిన రేవంత్ రెడ్డి అవినీతి బయటపడుతూనే ఉంటుందన్నారు. ప్రజలకు కోసం జైలుకు వెళ్ళిన వ్యక్తి హరీష్ రావు అని కొనియాడారు. కేసీఆర్ సైనికులం మేము భయపడమని చెప్పారు. హరీష్ రావు వెంట యావత్ తెలంగాణ సమాజం ఉందని, సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన హరీష్ రావు పై కావాలని నోటీసులు ఇచ్చారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేక డైవర్ట్ పాలిటిక్స్ చేస్తూ వస్తున్నారు అని మండిపడ్డారు. ప్రజల కోసం మాట్లాడుతున్న హరీష్ రావు పై కేసులు పెడుతున్నారుని, అవినీతికి పాల్పడుతున్న రేవంత్ రెడ్డి పైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్ని కుట్రలు చేసిన హరీష్ రావు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చిర్రా రవీందర్ యాదవ్ తెలిపారు. ప్రజా పాలన పేరుతో కేసులు పెడుతున్నారని, ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చెయ్యకుండా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తూ కాలం వెళ్లదిస్తున్నారని మండిపడ్డారు. నైని బొగ్గు టెండర్ తో పాటుగా రేవంత్ రెడ్డి బావమరిది టెండర్ రద్దు చేయాలని హరీష్ రావు మాట్లాడడం జరిగిందని, బాధ్యత గల ప్రభుత్వం ఐతే సమాధానం చెప్పాలి అన్నారు. సమాధానం చెప్పకుండా రాత్రికి రాత్రే హరీష్ రావుకు నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను అంతే ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. ఆడలేక మద్దేల దరువు అన్నట్లు ప్రభుత్వం తీరు ఉందని చిర్రా రవీందర్ యాదవ్ అన్నారు. ప్రభుత్వం చేసిన అవినీతి కప్పి పుచ్చుకునేందుకు ఈ డ్రామాని మొదలు పెట్టారని, కుట్రలు, కేసులతో బీఆర్ఎస్ నేతలను ఆపలేరని చిర్రా రవీందర్ యాదవ్ తెలిపారు.



# నిజం బ్రహ్మపదార్థమే

నేడు వార్తా పత్రికలు చదువుతుంటే పాఠకుడిగా ఏది నిజం అనే నిర్ధారణ రాలేకున్నాం.అది ఒక బ్రహ్మపదార్థం గా భావించాల్సి ఉంది.గతంలో ఎన్నడూ లేని విధంగా ఎలక్ట్రానిక్ మీడియా శాఖోప శాఖలుగా విస్తరించింది. అది చేసే అల్లరి అంతా ఇంత కాదు. "అదిగో పులి అంటే ఇదిగో" అనే సామెత లాగా ఏదైనా వార్త తెలిస్తే దానిపై విచారణ చేయకుండా చిలవలపలవలు అల్లుతారు. మరో మీడియా ఎక్కడ కవర్ చెస్తుందోనని ఆరాటంతో హడావుడిగా కథలు అల్లేస్తారు.నిజాలు ఎవరికీ అవసరం లేదు. అందులోనూ సోషల్ మీడియా దీనికి ఆజ్యం పోస్తున్నది. సంచలనమైన వార్త తెలిస్తే అది ఎంతవరకు నిజమో నిర్ధారించకుండా వైరల్ చేస్తున్నారు. దానివల్ల ఎన్ని లైక్స్ వచ్చాయని చూస్తున్నారుగాని ఆ వార్త వల్ల బాధితులు ఎంత ఆందోళన పడుతున్నారని ఆలోచించడంలేదు. అలాగే సోషల్ మీడియా బాధితులు అధికారులు, రాజకీయనాయకులా, సామాన్యులా అని ఆలోచించడంలేదు. ఇక పత్రికా రంగం గూర్చి చెప్పాలంటే ఎవరి ప్రయోజనాలు వారివి. అధికారపార్టీకి రెండు ప్రతిపక్షపార్టీకి రెండు పత్రికలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ప్రత్యక్ష సంఘటనలు మినహా మిగతా వార్తలు ఎవరికోణంలో వారు రాస్తున్నారు. రాజకీయంగా ఎదగాలంటే మనకు సొంత పత్రిక ఉండాలనే మైండ్ సెట్ లో నేటి నాయకులు ఉన్నారు. లేదా మనకు మద్దతు గా నిలిచే పత్రిక ఉండాలనే భావనతో ఎదో పత్రికతో బాదరాయణ సంబంధం కలుపుకుని సాగుతున్నారు. ఇటీవల తెలంగాణలో ఒక టెండర్ విషయంలో రేగిన వివాదం అందుకు తాజా ఉదాహరణ.దానిపై ఇరుపక్షాల పత్రికలు వారి వారి కథనాలు ఇచ్చి పాఠకులను అయోమయంలో పడవేసాయి.ఈ ఉదంతంతో మంత్రికి,మహిళా అధికారికి ముడిపెట్టి పబ్బం గడుపుకోవాలని చూసారు. ఈ వార్త ప్రసారం చేసిన ఛానల్ విలేకరులు అరెస్టయ్యారు. స్వామిభక్తితో చోక్కాచించుకోవడమే ప్రధాన కారణం. యాజమాన్యానికి లోబడి ఉండవచ్చు. కాని దానివల్ల భవిష్యత్ లో వచ్చే ప్రమాదాలు, కష్టాలు వివరించి చెప్పగలగాలి. ఆవేశంతో కళ్లుమూసుకుని పైవాళ్లు చెప్పింది చేస్తే ఇలాగే ఉంటుంది.

దానిలో గౌరవనీయులు గా సమాజంలో గుర్తింపు పొందిన వారిపై బురద జల్లడం ఎంతవరకు సమంజసం అని పాత్రికేయులు ఆలోచించాలి. నేటి రాజకీయాలలో ఎవరు నిజంగా చిత్తశుద్ధితో ఉన్నారో గుర్తించడం కష్టమే కనుక విచారణ తప్పనిసరి.ఎందుకంటే రాజకీయాలు అలా కలుషితం అయ్యాయి.దీనిపై వారు తమకు సంబంధంలేదని చేస్తున్న ప్రకటనలతో నిజం బ్రహ్మపదార్థంగా అర్థమవుతున్నది. కోసమెరుపు ఏమిటంటే చివరకు ఆ టెండర్ రద్దు చేయడం.ఆశించిన వారికి నిరాశ. అమాయకులు అల్లరి అవడంతప్ప ప్రయోజనం శూన్యం.నిజాన్ని బ్రహ్మపదార్థంగా మార్చవద్దని పాత్రికేయులకు విన్నవించడం తప్ప చేసేది ఏమీలేదు.

**యం.వి.రామారావు**

**- నవతరం: విజయవాడ**

# రెండేళ్లుగా 'చీకట్లోనే' సెంట్రల్ లైటింగ్!

- స్తంభాలు లేవు.. వెలుగులు లేవు.. కేవలం తవ్వకాలే!
- అశ్వారావుపేటలో అటకెక్కిన సుందరీకరణ పనులు.
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై అధికారుల మౌనం.. ప్రజల ఆగ్రహం
- రెండేళ్లుగా స్తంభాల కోసం ఎదురు చూస్తున్న డివైడర్లు
- కాంట్రాక్టర్కు నోటీసులు ఎందుకు ఇవ్వలేదు





నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి జిల్లా:

ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా అశ్వారావుపేట మండల కేంద్రం ప్రధాన రహదారి తలరాత మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో హడావుడిగా ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్ పనులు నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. పనులు ప్రారంభించి రెండు వసంతాలు గడిచినా, కనీసం విద్యుత్ స్తంభాలు నాటే దిక్కులేకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రధాన రహదారిని సుందరీకరించాలని లక్ష్యంతో ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్ పనులు అటకెక్కాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు సంవత్సరాల క్రితం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పనులను ప్రారంభించారు. కానీ నేటికీ ఆ పనులు పూర్తిగా కాకపోవడంతో స్థానికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నిలిచిపోయిన పనులు- పెరిగిన ఇబ్బందులు**

పనుల ప్రారంభంలో డివైడర్ల నిర్మాణం విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి పనులు వేగంగా సాగిన ఆ తర్వాత పురోగతి కనిపించలేదు మధ్యలోనే పనులు నిలిచిపోవడంతో సగం నిర్మించిన డివైడర్లు ప్రమాదాలకు మారాయి రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేక వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

**ప్రజాధనం వృధానేనా?**

లక్షలాది రూపాయల ప్రజాతనంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ఇలా అర్ధాంతరంగా ఆగిపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం మారిన అధికారులు మారిన ఈ పనులు పై ఎవరూ దృష్టి సారించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గత పాలకులు ప్రారంభించిన పనులని ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదా లేక నిధుల కొరత కారణమా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు విద్యుత్ స్తంభాలే నాటకుండా రెండేళ్లు కాలయాపన చేయడం అనేది కచ్చితంగా కాంట్రాక్టర్ లేదా పర్యవేక్షించే అధికారుల వైఫల్యమే. సాధారణంగా ప్రభుత్వ పనులకు అగ్రిమెంట్ ఉంటుంది. అందులో పనులు పూర్తి చేయడానికి ఒక కచ్చితమైన గడువు ఉంటుంది ఆ గడువు దాటితే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**గడువు ముగిసినా కదలని వైనం:**

ఏదైనా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులు మొదలుపెట్టినప్పుడు దానికి ఒక నిర్దిష్ట గడువు ఉంటుంది. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వారావుపేటలో కాంట్రాక్టర్ తీరు 'ఆమెడకైనా.. కాలినడకన' అన్నట్లుగా సాగుతోంది. రెండేళ్ల క్రితం డివైడర్ల కోసం రోడ్డు మధ్యలో తవ్వకాలు జరిపి వదిలేశారు. కానీ ఇప్పటివరకు అక్కడ కనీసం ఒక్క పోల్ (స్తంభం) కూడా ఏర్పాటు చేయలేదు. ఈ జాప్యానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా లేక అధికారుల పర్యవేక్షణా లోపమా అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రమాదాలకు నిలయంగా ప్రధాన రహదారి:**

సెంట్రల్ లైటింగ్ కోసం చేసిన తవ్వకాలు, అర్ధాంతరంగా ఆగిన డివైడర్ల నిర్మాణం కారణంగా రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో చీకట్లో డివైడర్లు సరిగ్గా కనిపించక నిత్యం చిన్నపాటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పట్టణ సుందరీకరణ పేరుతో ప్రజలను ఇబ్బందుల పాలు చేయడం ఎంతవరకు సమంజసమని స్థానిక వ్యాపారులు నిలదీస్తున్నారు.

**అధికారులు స్పందించే వరకు 'నవతరం' పోరాటం:**

ప్రజాధనం వృథా అవుతున్నా, పనులు నత్తనడకన సాగుతున్నా సంబంధిత శాఖాధికారులు కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు, స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని, సదరు కాంట్రాక్టర్‌కు గడువు నిర్దేశించి పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన నవతరం పత్రిక ఆందోళనలను ఉధృతం చేస్తుంది.

**స్థానికుల డిమాండ్**

మండల కేంద్రానికి మణిహారంగా ఉండాల్సిన సెంటర్ లైటింగ్ వ్యవస్థ, ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటదంగా మారింది. ప్రజా ప్రతినిధులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన ఈ పనులను పూర్తి చేయాలని అశ్వారావు పేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# పలాస అభివృద్ధికి పెద్దపీట

**రూ. 50 లక్షల నిధులతో పూర్తయిన పనులు ప్రారంభం, త్వరలో రూ. 2 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టనున్న ఎమ్మెల్యే గౌతు శిరీష**

పలాస, జనవరి 20: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష గారు స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో, బడ్డీ పోలమ్మ గుడి సమీపంలో సుమారు రూ. 50 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో మరో రూ. 2 కోట్ల నిధులతో మరిన్ని పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

**ప్రారంభమైన మౌలిక వసతుల పనులు**

మంగళవారం ఉదయం అన్నపూర్ణ ఆశ్రమం శివారు ప్రాంతంలోని బడ్డి పోలమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష గారు, కూటమి నాయకులతో కలిసి రెండు సీసీ రోడ్లు, కాలువలు, కంచర వీధి సమీపంలో రెండు పవర్ బోర్లను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ సుమారు 50 లక్షల రూపాయలు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజల చిరకాల సమస్యలు తీరనున్నాయని, మెరుగైన రవాణా, తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు.

**త్వరలో రూ. 2 కోట్లతో 30 రకాల పనులు**

ఈ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే, మున్సిపాలిటీ పరిధిలో త్వరలోనే సుమారు 30 రకాల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం మున్సిపల్ నిధుల నుంచి దాదాపు రూ. 2 కోట్లు కేటాయించినట్లు ఆమె తెలియజేశారు. ఈ పనుల ద్వారా పట్టణ స్వరూపాన్ని మార్చడంతో పాటు, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు.



**ప్రజల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం**

ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమం పట్ల తమ కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తున్నాయని ఎమ్మెల్యే గౌతు శిరీష గారు అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com